## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో పడేస్తాం

- ధరణిపై కాంగ్రెస్ దుష్ప్రచారం
- మూడు గంటల కరెంటుపై రైతుల అసహనం
- ఆ పార్టీకి ఓటు వేయం
- మళ్లీ బీఆర్ఎస్సే రావాలే..

**అలవిగాని హామీలతో తెలంగాణలో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. పాచిక పారకపోవడంతో కుట్రలకు తెరలేపింది. 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా, ధరణి వంటి వాటితో సంబురంగా బతుకుతున్న అన్నదాతల బతుకుల్లో నిప్పులు పోయాలని కంకణం కట్టుకున్నది. అధికారంలోకి వస్తే తమ తొలి టార్గెట్ వారేనని బాహాటంగానే చెప్పేసిం ది. ధరణిని రద్దు చేస్తామని, 24 గంటల కరెంటు స్థానంలో మూడు గంటల కరెంటుతో సరిపెడతామని చెబుతూ ఇప్పటినుంచే రైతులను భయపెడుతున్నది. కాంగ్రెస్ పాలనలో అనుభవించిన కష్టాలు ఇంకా కండ్ల ముందు కదలాడుతుండడంతో రైతన్నలు సమయం కోసం ఎదురుచూస్తున్నారు.తమను గోసపుచ్చుకున్న హస్తం పార్టీని ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కనివ్వకుండా తరిమికొడతామని శపథం చేస్తున్నారు. ధరణిని కాంగ్రెస్ రద్దు చేయడం కాదు.. తామే వారిని బంగాళాఖాతంలో పడేస్తామని బాజప్తా చెబుతున్నారు.**

### వ్యవసాయం వారికి తెల్వదు..



మామడ, నవంబర్ 23 : వ్యవసాయానికి ఎన్ని గంటల కరెంటు సరిపోతుందో కాంగ్రెసోళ్లకు తెల్వదు. ఎకరా పొలానికి నీరు పారించేందుకు ఎన్ని గంటల కరెంటు సరిపోతుందో తెలిస్తే ఇలా మూర్ఖంగా ఎలా మాట్లాడుతారు. 10 హెచ్‌పీ మోటర్లు తీసుకుంటే మళ్లీ అప్పుల పాలు కావాల్సిందే. మాకు ఇప్పుడిచ్చే 24గంటల కరెంటే బాగుంది. మా ఓటు సీఎం కేసీఆర్‌కే వేస్తాం. మరింత అభివృద్ధి చేస్తారు.

**- జక్కుల రాజన్న, రైతు (పొన్కల్)**

### కాంగ్రెసోళ్లకు అవగాహన లేదు..



సోన్, నవంబర్ 23 : మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు అని కాంగ్రెసోళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారికి వ్యవసాయం పై అవగాహన లేదు. ఈ మోటర్లు ఒకవేళ పెడిగే బోర్లలో నుంచి బురద బయటకొస్తుంది. మోటర్లు కాలిపోతే మళ్లీ పాత రోజులు వస్తాయని భయ మేస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అయ్యాక మంచిగా 24 గంటల కరెంటు ఇస్తున్నారు. ఎటువంటి టెన్షన్ లేకుండా మోటరు చాల్ చేసి ఇంటికొచ్చి వేరే పని చేసుకుంటున్నాం. గుంట భూమి విడిచిపెట్టకుండా పంటను వేస్తున్నాం. ఇప్పుడు ఆ మూడు గంటల కరెంటు వద్దు, 10హెచ్‌పీ మోటర్లు అంతకంటే ఎక్కువ అవసరమే లేదు. కేసీఆర్ సార్ మంచిగా ఆలోచించి రైతుల పక్షపాతిగా ఉన్నాడు.మళ్లీ కేసీఆరే సీఎంగా ఉండాలి.

**- అశోక్, రైతు(మురాపూర్)**

### ధరణే ఉండాలే..



సోన్, నవంబర్ 23 : ధరణి వల్ల చాలా మందికి ఈజీగా రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. ఒకప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే చెప్పులు అరిగే దాకా తిరిగేవాళ్లం. భూమి పట్టా పాసుపుస్తకంలోకి ఎక్కాలంటే. ఇప్పుడు మీ సేవకేంద్రానికి వెళ్లి స్లాట్ బుక్ చేసుకొని తెల్లారి తహసీల్ కార్యాలయానికి వెళ్తే ఐదు నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ అవుతున్నది. మళ్లా మన ఫోన్‌లోనే మన సర్వేనంబర్లు అన్ని కనిపిస్తున్నాయి. ఇంతకంటే మంచిది ఎప్పుడైనా చూశామా. ఈ రోజుల్లో పని తొందరగా అయిపోతే చాలు.అంతకంటే ఇంకా ఎక్కువ ఏమి ఉండదు. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. వారిని నమ్మితే నట్టేట ముంచుతరు. బీఆర్ఎస్ సర్కారే ఉండాలే.

**- సురేశ్, రైతు, వెంగ్వాపేట్**

### కాంగ్రెస్ పాలనలో కరెంట్ కట్‌కటే



మామడ, నవంబర్ 23 : కాంగ్రెస్ పాలనలో కరెంట్ కట్ కట ఉండేది. కరెంట్ ఎప్పుడు వస్తదో ..ఎప్పుడు పోతదో ఎవరికీ తెలియదు. రాత్రుళ్లు కరెంట్ పెట్టబోయి ఎంతోమంది చనిపోయిన్రు. సబ్‌స్టేషన్, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే బాగు చేయాలని మొత్తుకున్నా పట్టించుకున్నోళ్లు లేరు. అరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్లులేక కళ్లముందే ఎండిపోతుంటే రాస్తారోకోలు చేసేవాళ్లం. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తున్నారు. హాయిగా రెండు పంటలు పండించు కుంటున్నాం. మూడు గంటల కరెంట్‌తో అన్నీ కష్టాలే. అందరూ ఒకే సారి మోటర్లు ఆన్‌చేస్తే మళ్లీ నాటి పరిస్థితులు వత్తాయి. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోతాయ్. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మవద్దు

**- మల్యాల మల్లన్న, రైతు(న్యూలింగంపెల్లి)**

### రైతులు బాగుండడం ఇష్టం లేదు..



మామడ, నవంబర్ 23 : కాంగ్రెస్ నాయకుల మాటలు వింటుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. రాత్రిపూట వ్యవసాయ బావిల కాడికి పోయి కరెంటు కోసం పడిగాపులు గాచే వాళ్లం. మోటర్లు పెట్టెందుకు పోతే ఇంటికి తిరిగి వచ్చేది గ్యారెంటీ లేకుండే. అప్పులు తెచ్చి ఎవుసం చేసేవాళ్లం. తెలంగాణ ప్రభుత్వం కరెంటు కష్టాలు తీర్చింది. కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో చెప్పే మాటలు వింటుంటే రైతులు సంతోషంగా ఉండడం వారికి ఇష్టం లేదు. కాంగ్రెస్‌కు నాలుగు ఓట్లు వచ్చేది లేదు.. సచ్చేది లేదు. మళ్లీ బీఆర్ఎస్ సర్కారు రావాలే. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలే. తిన్న రేవు తాల్వలే.. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారు.

**- రాజేశ్వర్,రైతు(కొరిటికల్)**

### కరెంటుపై మోసపూరిత వైఖరి..



మామడ, నవంబర్ 23 : మూడు గంటల కరెంటు పై కాంగ్రెస్‌ది మోసపూరిత వైఖరి. ఆ పార్టీ హయాం లో అచ్చిరాని కరెంటుతో మోటర్లు కాలిపోయేవి. వాటి రిపేరుకు డబ్బులు లేక అప్పులు చేసేవాళ్లం. అప్పటికే పంటలకు నీరు అందక ఎండిపోయేవి. తీసుకొచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడేవాళ్లం. కొంత మంది రైతులు బావుల కాడనే ఆత్మహత్యలు చేసుకునేవారు. దీనంతటికి కారణం కాంగ్రెస్సే. రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ సార్ 24గంటల కరెంటు ఇస్తున్నరు. నీరు పుష్కలంగా ఉండడంతో దిగుబడి కూడా పెరిగింది. కాంగ్రెస్ వాళ్లు ఇస్తామంటున్న మూడు గంటల కరెంటుతో రైతులకు మళ్లీ పాత రోజులే వస్తాయి. కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితులో నమ్మం.

**- మరిపెద్ద సాగర్, రైతు(న్యూలింగంపెల్లి)**

### అవగాహన లేని మాటలు..



మామడ, నవంబర్ 23 : 10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయమా అది ఎట్లాసాధ్యం.10హెచ్‌పీ మోటర్లు వాడితే కరెంట్ ఎంత కాలుద్ది. పాత బోర్లు తీసి కొత్త బోర్లు వేయాలా .. 10హెచ్‌పీ మోటర్లతో బోర్లలో నీళ్లు ఉంటయా.. పైపులు ఎక్కడికక్కడ పగిలి పోతయ్. పొలాలు ఎండిపో తయ్. కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డికి కరెంట్ గురించి కనీస అవగాహన లేదు. ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల నాణ్యమైన కరెంట్‌తో రైతులు సంబురంగా సాగు చేసుకుంటున్నారు. రైతులు బాగు పడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేకనే మూడు గంటల కరెంటు సాలంటున్నారు. వారిని నమ్మితే నట్టేట ముంచుతరు. ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరు. బీఆర్ఎస్ సర్కారే మళ్లీ వస్తుంది.

**- నల్ల పోతారెడ్డి, రైతు(కొరిటికల్)**

### రైతుల ఆత్మగౌరవం పెరిగింది.



నిర్మల్‌టౌన్, నవంబర్ 23 : బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకనే రైతులకు ఆత్మగౌరవం పెరిగింది. కాంగ్రెసోళ్లు అధికారంలో ఉన్నప్పుడు కరెంటు కోసం ఎన్నో తిప్పలు పడ్డాం. పేరుకు 9 గంటల కరెంటే కానీ 5 గంటలు కూడా ఉండేది కాదు. లోవోల్టేజీతో మోటర్లు, స్టాటర్లు కాలిపోయేవి. దాని ఖర్చంతా నేనే పెట్టినా. పంట చేతికి వస్తదన్నా గ్యారంటీ లేకుండే. పండితే బాగుపడేటోళ్లం. పండకపోతే ఏడ్చేటోళ్లం. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక 24 గంటల కరెంటు, రైతుబీమా, పెట్టుబడి సాయం మాకు అన్ని విధాల ఆదుకుంటుంది. ఎక్కడికెళ్లినా రైతుగా గౌరవం దక్కుతుంది. గీ కాంగ్రోసోళ్లు రైతులకు చేసిందేమీ లేకపోగా గాలిమాటలతో ఆగం చేస్తున్రు.

**- పీ శ్రీనివాస్, రైతు( సిద్ధాపూర్)**

### ధరణి లేకపోతే బతుకులు ఆగమవుతయ్..



నిర్మల్‌టౌన్, నవంబర్ 23 : భూములను పక్కాగా రికార్డులను ఉంచేందుకే కేసీఆర్ ధరణి తెచ్చిన్రు. కాంగ్రెస్ హయంలో కాగితాల్లో భూముల వివరాలు ఉండడంతో రెవెన్యూ అధికారులు ఇష్టమొచ్చినట్లు రికార్డులు రాసి భూ వివరాలు ఆగమగం చేసిన్రు. పైసలిస్తే కాని పహానీ ఇవ్వకపోయేది. ధరణి వచ్చాక అన్ని వివరాలు అందులో నమోదు కావడంతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే పది నిమిషాల్లోనే పహానీ, డిజిటల్ సర్టిఫికెట్ రూపంలో రైతుల చేతికి వస్తుంది. అటువంటి ధరణిని ఎత్తివేస్తే మళ్లీ భూముల వివరాలు ఆగమగమవుతాయి. అందరం ఇబ్బందులు ఎదర్కొంటాం. ధరణి వద్దన్నా కాంగ్రెస్‌కు ఓట్లు వేయం. మళ్లీ బీఆర్ఎస్ సర్కారే రావాలే.

**- భూమయ్య, రైతు( సిద్ధాపూర్)**

### ధరణితో భూములకు భరోసా..



దిలావర్‌పూర్ నవంబర్ 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మా భూములకు భరోసా కలుగుతుంది. ఎందుకంటే మా భూములు ఇతరుల పేర్ల మీదకు వెల్లకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం భూమి యాజమానికి మాత్రమే పూర్తి హక్కు కల్పించాడు. భూమి ఉన్న వ్యక్తి మాత్రమే రిజిస్టేషన్ కార్యాలయానికి వెళ్లి బోటన వేలు పెడితేనే భూమి ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ అవుతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో భూములకు రక్షణ ఉండేది కాదు.భూముల వివరాలు అన్ని అప్పటి పట్వార్లు, ఆర్ఐల దగ్గర ఉండేవి. అలాంటి వ్యవస్థను తీసి వేసి ధరణి పోర్టల్ తీసుకొచ్చి పేదల భూములకు భరోస కల్పించిన కేసీఆర్ హ్యాట్సాప్.

**- నరేందర్ రైతు(న్యూలోలం)**

### మూడు గంటల పార్టీని నమ్మద్దు..



దిలావర్‌పూర్ నవంబర్ 23 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చి ఆర్థికంగాబలోపేతం చేస్తున్నారు. ఢిల్లీలో పార్టీ లీడర్ల కన్ను తెలంగాణలోని రైతులపై కన్నుపడింది. వారిని కేసీఆర్ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి కన్నెర్ర చేస్తున్నది. రైతులకు 10 హెచ్‌పీల మోటర్లు పెట్టి 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని ఓ పార్టీ, బీజేపీ రైతులకు మోటర్ల దగ్గర మీటర్లు పెట్టాలని చెబుతున్నది. ఈ రెండు పార్టీలు రైతులు భాగు పడుతుంటే వారికి నచ్చడం లేదు.రైతును రాజు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ గద్దలు పనిగట్టుకొని వచ్చి 3 గంటల కరెంట్ గురించి ప్రచారం చేస్తున్నాయి. మూడు గంటల కరెంట్ ఇస్తే ఏ విధంగా రైతు పంటలను సాగు చేస్తాడో ఆ పార్టీ నాయకులను మనం నిలదీ యాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన శాస్తి తప్పదు. వారిని ప్రజలు నమ్మడం లేదు.

**- రాథోడ్ ఆశోక్ రైతు**